సాక్షి
జోగుళాంబ గద్వాల
శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



పోలీసుల ఉక్కుపాదం

తరుచుగా నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలకు పోలీసులు సిద్ధమయ్యారు.

వివరాలు 8లో ▸



క్రమబద్ధీకరణ ఎప్పుడో..?

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.1 /28.3

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-38 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-40 (శనివారం తెల్లవారుజామున)

ఎవరిదీ పాపం..

కల్తీ కల్లు కాటుకు బలవుతున్న పేదలు

- దాదాపుగా అందరూ కూలీలు, కార్మికులే..
- ప్రతి ఏటా సహజంగా మారిన మరణాలు
- పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాల్లో పెను విషాదం
- అందని ద్రాక్షగా సత్వర న్యాయం
- ఫలితాల వెల్లడితోపాటు శిక్ష ఖరారులోనూ జాప్యం
- ధనబలంతో తప్పించుకుంటున్న అక్రమార్కులు

➡ 2021లో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇద్దరు..

➡ 2022లో జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురంలో ముగ్గురు..

➡ తాజాగా ఇటీవల మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలో ముగ్గురు..

..ఇవి ఉమ్మడి పాలమూరులో కల్తీ కల్లు కాటుకు బలై వెలుగులోకి వచ్చిన ఘటనలు. బేరసారాల మాటున వెలుగుచూడని చావులు ఇంకెన్నో ఉన్నాయి. అయినా ఆ కల్లు కల్తీ కాదు.. కల్లు తాగి ఎవరూ చనిపోలేదని చెప్పడం వైద్య, ఎక్సైజ్ శాఖకు ఆనవాయితీనే. ఇలా ప్రతిఏటా కల్తీ కల్లుతో మరణాలు సంభవించడం.. ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడల్లా ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్ అని కొట్టిపారేయడం సహజంగా మారింది. కల్తీ కల్లా.. కృత్రిమ కల్లా అని పక్కనబెడితే దానికి బానిసలుగా మారి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు మాత్రం వీధిన పడుతున్నాయి. ఫలితాల వెల్లడితో పాటు శిక్ష ఖరారులో జాప్యంతో సత్వర న్యాయం వారికి అందని ద్రాక్షగా మారింది. ధనబలంతో కల్లు మాఫియా అన్నీ తారుమారు చేసి తప్పించుకుంటున్నారు. – సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



కూలీలు, కార్మికులే బలి..

మందు కల్లు తాగుతున్న వారందరూ దాదాపుగా సామాన్య, మధ్య తరగతి ప్రజలే. వ్యవసాయ పనులకెళ్లే కూలీలు, అడ్డా కూలీలు, పారిశుద్ధ్య కార్మికులే అధిక సంఖ్యలో వ్యసనపరులుగా మారుతున్నారు. మందు కల్లు తాగడం ఆపేస్తే మానసిక స్థితిగతి తప్పడం.. ఫిట్స్ రావడం.. నాలుక కరుచుకుంటూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం వంటి ఘటనలు ప్రతి ఏటా చోటు చేసుకుంటున్నాయి. కోవిడ్ కాలంలో అధికంగా వెలుగుచూడగా అందరి దృష్టి పడింది. తాజాగా మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చనిపోయిన ముగ్గురు, వింత ప్రవర్తనతో చికిత్స కోసం వచ్చిన వారందరూ కూలీలు, కార్మికులే.

90 శాతం మేర మందు కల్లే..

మందు కల్లు దందా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 305 టీసీఎస్‌లు, 758 టీఎఫ్‌టీ, 17 డిపోలకు ఆబ్కారీ శాఖ లైసెన్స్‌లు మంజూరు చేసింది. తాటి, ఈత, ఖర్జూర వనాల నుంచి సేకరించిన స్వచ్ఛమైన కల్లును మాత్రమే వారు విక్రయించాలి. కానీ అంతటా కృత్రిమంగానే కల్లు తయారు చేస్తున్నారు. నిమ్మ ఉప్పు (పులుపు రావడానికి), సిల్వర్ (వైట్), శాక్రిన్ (తీపికి), డ్రైఈస్ట్ (నురుగు కోసం)తో పాటు కుంకుడుకాయల రసాన్ని వినియోగిస్తున్నారు. వీటితో పాటు మత్తు కోసం నిషేధిత ఆల్ప్రాజోలం గానీ, డైజోఫాం గానీ, క్లోరల్ హైడ్రేట్ (సీహెచ్)ను గానీ ఉపయోగిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో 90 శాతం మేర మందు కల్లు విక్రయాలే జరుగుతున్నాయి. సీసా కల్లు రూ.12 నుంచి రూ.15కు విక్రయిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు రోజంతా పనిచేసి అలిసిపోయిన క్రమంలో మత్తు కోసం కల్లుకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది.

ఫలితాలతోపాటు శిక్ష ఖరారులోనూ జాప్యం..

ఎక్కడైనా కల్తీ కల్లు మరణాలు సంభవిస్తే ఆయా డిపోల పరిధిలోనే సర్దుబాటు జరుగుతోంది. మృతుల కుటుంబాలకు ఎంతో కొంత పరిహారం ఇచ్చి విషయం బయటకు రాకుండా కల్లు డిపోల నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. మీడియాలో వస్తే తప్ప ఎక్సైజ్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కల్లు శాంపిళ్లను పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నారు. వీటి ఫలితాలు వచ్చే సరికి సుమారు ఐదారు నెలలకు పైగా సమయం పడుతోంది. మందు కల్లుతోనే మృతిచెందినట్లు ఫలితాల్లో తేలిన తర్వాతే శిక్ష ఖరారవుతోంది. జడ్చర్లలో 2021 డిసెంబర్‌లో కల్తీ కల్లు మరణాలు చోటు చేసుకుంటే.. 2022 జూలైలో ఫలితాలు రావడం.. ఆ తర్వాతే సదరు కల్లు దుకాణ యజమానిని రిమాండ్‌కు పంపడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



ఈ ఫొటోలోని మహిళ గద్వాల పట్టణానికి చెందిన అన్నమ్మ. గతంలోనే ఆమె భర్త యాదగిరి కల్తీ కల్లు మహమ్మారి బారిన పడి మృతి చెందాడు. వీరికి ఒక పాప, ఒక బాబు. ఇద్దరు పిల్లలను ఆమె తన రెక్కల కష్టంతో పెంచుతోంది. ఉదయం ఆకుకూరలు అమ్ముకుంటూ.. వ్యవసాయ సీజన్‌లో కూలీకి పోతూ జీవనం కొనసాగిస్తోంది. పాపకు ఇటీవలే పెళ్లి చేసింది. అప్పులు తడిసి మోపెడు అయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతోంది. కల్తీ కల్లు తాగి మరణిస్తే ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదని.. నా మాదిరిగా కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే కల్తీ కల్లును పూర్తిగా బంద్ పెట్టాలని ఆమె డిమాండ్ చేస్తోంది.



ఎలాంటి న్యాయం జరగలేదు..

మాది గద్వాల పట్టణం. నా భర్త మందు కల్లుకు బలయ్యాడు. దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినం. కానీ మాకు ఎలాంటి న్యాయం జరగలేదు. నాకు ఇద్దరు సంతానం. ఇస్త్రీ చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాం. చేతులాడితే గానీ డొక్క నిండని పరిస్థితి. నా మాదిరి ఇంకో కుటుంబానికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చాకలి శాంతమ్మ, కల్తీ కల్లు తాగి మృతి చెందిన గట్టన్న భార్య



దిక్కుతోచని స్థితిలో వెంకటేశ్ భార్య, ముగ్గురు పిల్లలు

ఒకరు రైల్వే స్టేషన్‌లో హమాలీ.. ఇంకొకరు మేస్త్రీ కింద కూలీ.. ఇద్దరు యువకులు మంచి స్నేహితులు.. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు వారివి. ఇలాంటి కడు బీద కుటుంబాల్లో హాలాహలంగా మారిన మందు కల్లు చిచ్చుపెట్టింది. 2020 డిసెంబర్ 13న జడ్చర్ల మండల పరిధిలోని ఆలూరులో కల్లు దుకాణంలో కల్లు తాగిన బాదేపల్లి పాతబజార్‌కు చెందిన వెంకటేశ్(28), నిమ్మబాయిగడ్డ ప్రాంతానికి చెందిన ఖాసీం(26) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. వెంకటేశ్‌కు తల్లి శాంతమ్మతో పాటు భార్య విజయలక్ష్మి, పిల్లలు వరుణ్‌కుమార్, వర్షిత, రమ్య ఉన్నారు. ఖాసీంకు భార్య యాదమ్మ ఉన్నారు. చిన్నవయసులోనే ఇరువురు కానరాని లోకాలకు వెళ్లడంతో ఆ రెండు కుటుంబాలు కష్టాలతోనే కాలం వెళ్లదీస్తున్నాయి.

ప్రభుత్వం పట్టించుకోలేదు..



నా భర్త, నేను ఇద్దరం సిమెంట్ పనులకెళ్లేవాళ్లం. మళ్లీ వస్తానంటూ నా భర్త బయటకు వెళ్లాడు. కొద్ది గంటలకే కల్లు తాగి మృత్యువాత పడ్డాడు. ఒంటరి తనాన్ని భరించలేక నా భర్త సోదరితో కలిసి ఉంటున్నా. అతడు కట్టిన ఈ చిన్న గూడే మాకు దిక్కు. ఇది కూడా పెచ్చులూడుతోంది. ప్రతిరోజు కూలీ పనులకు వెళ్తా. కూలీ దొరకని రోజు పస్తులే. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేకుండా పోయింది.

– యాదమ్మ, మృతి చెందిన ఖాసీం భార్య, నిమ్మబాయిగడ్డ, జడ్చర్ల

న్యూస్‌రీల్

విద్యారంగ పరిరక్షణకు పోరాటాలు



గద్వాల: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాజీలేని పోరాటాలు చేసిందని పలువురు పేర్కొన్నారు. గురువారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక స్పృహ కలిగిన సంఘంగా కరోనా సమయంలో, గతంలో పేద వర్గానికి చెందిన కార్మికుల కోసం సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. గత పదేళ్లుగా వివిధ యాజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. బదిలీలపై హైకోర్టులో ఉన్న కేసు జూన్ 13కు వాయిదా వేయడం విచారకరమన్నారు. ఈ వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పీఆర్సీ 2023ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, నాయకులు చక్రదర్, హుస్సేని, జయచంద్ర, చిరంజీవినాయుడు, రమణ, రాజేష్, బీచుపల్లి, సుదర్శన్, కృపేందర్, శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



అయిజ: ప్రతి గ్రామం, పట్టణంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యర్తలు నిరంతరం కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశవ్యాప్తంగా బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బూత్ స్థాయిలో వివరించి, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలుపుకోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్.. తన కుటుంబసభ్యుల అభ్యున్నతి కోసం మాత్రమే పనిచేస్తూ.. కుటుంబపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నడుస్తున్న నియంత పాలన అంతం చేయాలంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణాలో రావాలని, అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మాదన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పీయూలో క్విజ్, పాటల పోటీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహనీయుల జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గురువారం పీయూలో క్విజ్, పాటల పోటీలు నిర్వహించారు. పోటీలో అంబేడ్కర్,జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్‌రామ్‌కు సంబంధించిన ప్రశ్నలను కలిపి మూడు రౌండ్లు, ఒక్కో కోర్సుతో కూడిన 11 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి ఎంఈడీ కోర్సు జట్టు, రెండో బహుమతి ఎంబీఏ జట్టు, మూడో బహుమతి ఎంఏ పొలిటికల్ సైన్స్ జట్టుకు దక్కాయి.

అలరించిన కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ్

గద్వాల: అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గురువారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆద్యంతం అలరించింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కవులు తెలుగు, హిందీ బాషల్లో అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తి, విధానాలు తదితర అంశాలపై పద్య, గేయ, గజల్ రూపాల్లో కవితలను వినిపించారు. పలువురు కవులు వినిపించిన కవితలు ఆహుతులను రంజింపజేశాయి. మరికొన్ని కవితలు ప్రేక్షకుల కరతాల ధ్వనులను అందుకున్నాయి. సుమారు రెండు గంటల పాటు ఈ కవి సమ్మేళనం సాగింది.

ఉద్యమాల్లో కవుల పాత్ర కీలకం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమంలో కవుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సమాజాన్ని మార్చే శక్తి పాటలకు, కవితలకు, రచనలకు ఉందన్నారు. కవులు, కళాకారుల సేవలు, కృషిని గుర్తించిన సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. యువత దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కుల, వర్గ వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం అంబేడ్కర్ కృషి చేశారని చెప్పారు. కవులు, రచయితలు ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యతోనే అణగారిన వర్గాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం కవులు, రచయితలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ అధికారి రామంజనేయులు, వెంకటరామయ్యశెట్టి, అరుణ, శ్రీనాథ్, ఆనంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



నేరసమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ సృజన

గద్వాల క్రైం: శాంతి భద్రతల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోజు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ సృజన ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, జాతీయ రహదారి, ఆయా మండలాల మీదుగా ఉన్న రోడ్లపై డెంజర్ స్పాట్స్ గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం, గంజాయి, నిషేధిత పదార్థాలు తరలించకుండా సరిహద్దు ప్రాంతాల వద్ద పటిష్టమైన నిఘా ఉంచాలని, చోరీ కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా నిందితులను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. డయల్ 100 కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పెట్రోలింగ్, గస్తీ ముమ్మురం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు చంద్రశేఖర్, సూర్యనాయక్, శివశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

‘కల్తీ కల్లు వ్యాపారంలో మంత్రి పాత్ర’: డీకే అరుణ

పాలమూరు: కల్తీ కల్లు వ్యాపారం ద్వారా ప్రతి రోజు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఆయన తమ్ముడుతో పాటు మరో వ్యక్తికి కలిపి రూ.3 లక్షల నగదు వెళ్తుందని, దీంతో పాటు ఎక్సైజ్ అధికారులకు రూ.50వేలు ముడుతున్నాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహించే జిల్లాలో విచ్చలవిడిగా కల్తీకల్లు వ్యాపారం జరుగుతుందని, ఇందులో మంత్రి పాత్ర ఉందన్నారు. ఈత చెట్లు లేకపోయినా కల్లు ఎక్కడి నుంచి వస్తోందని ప్రశ్నించారు.ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పాలమూరులో మాట్లాడే స్వేచ్ఛా లేకుండా చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కల్తీకల్లు వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ చేయించి.. వెనుక ఉన్న అసలైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్వరలో పాలమూరులో నిరుద్యోగ మార్చ్

వరంగల్ జిల్లాలో ఈ నెల 15న నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నామని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన నిరుద్యోగ మార్చ్ త్వరలో పాలమూరులో నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. ఈ నిరుద్యోగ మార్చ్‌కు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నిరుద్యోగ మార్చ్ నిర్వహణ ఇన్‌చార్జ్ ఎస్పీఎస్ ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జ్ భరత్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కె.సరిత

గద్వాల రూరల్: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మంత్రిగా పనిచేసినప్పుడు సీఎం కేసీఆర్ దేవుడు, ఆయన వల్లే తెలంగాణ అభివృద్ధి చెందిందని చెప్పి.. ఇప్పుడు సోయితప్పి మాట్లాడుతున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కె.సరిత అన్నారు. గురువారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రిగా ఉన్నప్పుడు ఒకలా.. ప్రజల చేతిలో ఓడిపోగానే మరోలా మాట్లాడడం జూపల్లి దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిజంగానే తెలంగాణ ప్రజలపై ప్రేమ, అభివృద్ధిపై ధ్యాస ఉంటే ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అక్కడి ఎమ్మెల్యేకు సహకరిస్తూ ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని హితవు పలికారు. ఇకపై సీఎం, మంత్రిపైన విమర్శలు చేస్తే సహించేది లేదని, ఆయనను తరమికొట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, కుర్వపల్లయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

గద్వాల రూరల్: ఇఫ్తార్‌విందు మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ ఆధ్వర్యంలో ఒంటిలపేటలో రంజాన్ నేపథ్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోవిందు, కౌన్సిలర్లు నరహరి శ్రీనివాసులు, నాగరాజు, శ్రీనువాసులు, భగీరథ వంశీ, కురుమన్న, షుకూర్, ఫయాజ్, మొబిన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, గద్వాల పట్టణానికి చెందిన అబ్దుల్ రషీద్‌కు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.12వేల చెక్కు మంజూరు కాగా.. వారి బంధువులకు అందజేశారు.

తాగునీటి సమస్యపై అధికారుల విచారణ



గట్టులో విచారిస్తున్న అధికారులు

గట్టు: గట్టులో నెలకొన్న తాగునీటి సమస్యపై అధికారులు గురువారం విచారించారు. గట్టులోని 5, 6 వార్డుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదని, రెండేళ్లుగా తాము తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నట్లుగా పలువురు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మిషన్ భగీరథ డీఈఈలు మోహిన్, రవిచంద్రారెడ్డి, ఏఈ కృష్ణయ్య, సర్పంచు ధనలక్ష్మి, కార్యదర్శి జగన్నాథరావు.. కత్రిగేరి, బండమీది గేరిలో పర్యటించి కాలనీ వాసుల ద్వారా తాగునీటి సరఫరా గురించి విచారించారు. నీటి కోసం తాము రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్నామని, వేసవి కాలంలో మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉన్నట్లు కాలనీ వాసులు అధికారుల ముందు వాపోయారు. ఈ వార్డులకు ప్రత్యేక పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయాలని వారి దృష్టికి తీసుకువచ్చారు. నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని అధికారులు హామీ ఇచ్చినట్లుగా కాలనీ వాసులు తెలిపారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి

అయిజ: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వివిధ బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ అర్జున్ కోరారు. మండలంలోని యాపదిన్నె లో పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.436 చెల్లిస్తే 50 ఏళ్లలోపు వారు సాధారణ మరణం చెందినా రూ.2లక్షలు బీమా వర్తిస్తుందని, 50 ఏళ్లు పైబడి 70 ఏళ్లలోపు వారు రూ.20 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు బీమా నామినీకి అందజేస్తామని అన్నారు. అంతేగాక ఏపీజీవీబీలో రూ.వెయ్యి చెల్లించి బీమా చేస్తే ప్రమాద బీమా కింద నామినీకి రూ.20 లక్షలు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈసందర్భంగా ఇటీవల సాధారణ మృతిచెందిన అయిజకు చెందిన నాగవేణి కుమారుడు వెంకటేష్‌కు రూ.2 లక్షల బీమా చెక్కును మేనేజర్ అందజేశారు. ప్రతి ఏటా మే నెలలో బీమా డబ్బులు చెల్లించాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు క్యాషియర్ రుషికేశవరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ, ఖాతాదారులు బత్కన్న, గిడ్డన్న, సోమన్న, గుండన్న, నాగన్న, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఉక్కుపాదం!



నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు

- జిల్లాలో పోలీస్‌స్టేషన్ల వారీగా జాబితాలు సిద్ధం
- ఆరేళ్లలో 24 మందిపై నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: వరుస దొంగతనాలు, నేరాలు, ఘర్షణలు, అల్లర్లకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. జిల్లాలో తరచూ నేరాలు చేసి జైలుకు వెళ్లి తిరిగొచ్చి యధావిధిగా అవే పనులు చేసేవాళ్లపై పోలీసులు పీడీ యాక్టు నమోదు చేయనున్నారు. చట్టంలోని కొన్ని లొసుగులను ఆధారం చేసుకొని బెయిల్‌పై వచ్చి తిరిగి నేరాలు చేసే ముదిరిన నేరగాళ్లను నియంత్రించేందుకు మహబూబ్‌నగర్ పోలీసులు పీడీ (ప్రివెంటివ్ డిటెన్షన్) యాక్టు నమోదు చేయడం ఒక్కటే పరిష్కారంగా భావిస్తున్నారు. ఇందులో రౌడీషీటర్లు, గంజాయి, పీడీఎస్ బియ్యం రవాణా చేసేవారు, భూకబ్జాదారులు, హత్యకేసుల్లో నిందితులుగా ఉన్న వారు ఉండనున్నారు. జిల్లాలో ఆరేళ్ల కాలంలో 24 మందిపై పీడీ యాక్టు నమోదైతే వీరిలో ఆరుగురు నేరస్తులు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. మరో 14 మందిపై పీడీయాక్ట్ నమోదు చేసే దశలో ఉన్నారు.

పీడీ యాక్ట్ నమోదు ఇలా..

పదే పదే నేరాలు, దొంగతనాలు, అక్రమ రవాణాకు పాల్పడేవారు, అల్లర్లు సృష్టించే వారు, మతపరమైన ఘర్షణలు ప్రేరేపించే వారు ఇలా ఎవరిపైన అయినా పీడీ యాక్ట్ నమోదు చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. అయితే ఇందుకు సంబంధించి ఎస్పీ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేస్తే వారు పరిశీలించి పీడీ యాక్ట్ నమోదుకు ఉత్తర్వులు జారీ చేస్తారు. పీడీ యాక్ట్ నమోదు చేయాలంటే నిందితుడు, నేరస్తుడు కనీసం నాలుగు నుంచి ఐదు కేసుల్లో భాగస్వామి అయి ఉండాలి. ఒకవేళ రెండు కేసుల్లో నేరస్తుడిగా ఉన్నా తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిన వాటిని కూడా లెక్కల్లోకి తీసుకొని పీడీ చట్టం ప్రయోగించే అధికారం పోలీసులకు ఉంది.

ఇతర నేరస్తులపైనా..

జిల్లా పోలీస్‌శాఖ పరిధిలో పదే పదే నేరాలకు పాల్పడే వారి లెక్కలు గతంలోనే తీశారు. ఆ జాబితాను పోలీస్‌స్టేషన్ల వారీగా సిద్ధం చేశారు. ఇందులో నుంచి ఒక్కొక్కరిపైనా వరుసగా పీడీ చట్టం నమోదు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. దొంగతనాలు, మతపరమైన అల్లర్లు, అక్రమ రవాణాదారులు, హత్యలు చేసే నేరస్తులు జాబితాలో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

పీడీ యాక్ట్ నమోదు ఇలా..

సంవత్సరం	కేసులు
2018	1
2019	5
2020	4
2021	4
2022	6
2023	4

- నేరగాళ్ల సమాచారం రాబట్టి దానికి సంబంధించిన సాక్ష్యాలను సేకరిస్తారు. ఆ తర్వాత హైకోర్టులో ప్రత్యేక బెంచ్ నుంచి అనుమతి తీసుకొని నిందితులను ముందస్తు అరెస్టు చేసి నేరుగా జైలుకు పంపిస్తారు. మూడు నుంచి 12 నెలల వరకు జైలులో ఉంచుతారు. వారికి ఎలాంటి బెయిల్ మంజూరు కాదు. ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి ఏడాది పాటు శిక్ష అమలులో ఉండనుంది. పీడీ చట్టం కమిటీ శిక్షను తిరస్కరిస్తే తక్షణమే జైలు నుంచి విడుదల చేస్తారు. గతంలో కలప స్మగ్లర్లు, కరుడుగట్టిన నేరగాళ్లు, పదే పదే దోపిడీలు చేసే వారిపై దీనిని ప్రయోగించేవారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని మార్పులతో ప్రస్తుతం దీనిని చాలామందిపై ప్రయోగిస్తున్నారు. పీడీ యాక్టు ఉత్తర్వులను నేరుగా పోలీస్ ఉన్నతాధికారి జారీ చేయవచ్చు.

నేరాలను కట్టడి చేసేందుకే..

నేరాలను కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది ఇప్పటి వరకు నలుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేశాం. కొత్తగా జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 మంది, రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరు, భూత్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేయబోతున్నాం. సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై తప్పక అమలు చేస్తాం. దొంగతనాలు, హత్యాలు, హత్యాయత్నాలు, మత్తు పదార్థాలు, నకిలీ విత్తనాల విక్రయాలు, రవాణా, భూ కబ్జాలు, పేలుడు పదార్థాలు, డెకాయిట్, సైబర్ క్రైం తదితర కేసుల్లోనూ వీటిని ఉపయోగిస్తాం.

– కె.నరసింహ, ఎస్పీ, మహబూబ్‌నగర్

క్రమబద్ధీకరణ ఎప్పుడో..?



ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహబూబ్‌నగర్ మండల పంచాయతీ కార్యదర్శులు

- జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఎదురుచూపులు
- నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా.. ప్రభుత్వం నుంచి రాని ఉత్తర్వులు
- విడతల వారీ ఆందోళనలకు రంగం సిద్ధం
- 28 నుంచి సమ్మెలోకి..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/సాక్షి నెట్‌వర్క్: పల్లె ప్రగతి.. పట్టణ ప్రగతి.. హరితహారం.. ఉపాధి హామీ.. ఇలా ప్రతి ప్రభుత్వ పథకం పక్కాగా అమలయ్యేలా చూడడంతోపాటు గ్రామ పంచాయతీలను ప్రగతిబాట పట్టించడంలో కీలకపాత్ర పోషించారు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు. దాదాపు నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్ పూర్తి కానున్న నేపథ్యంలో వీరిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తుందా.. లేదా అన్న అయోమయం నెలకొంది. పని భారం పెరిగినా.. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా ఒర్చుకొని పని చేశామని, ఇప్పటికైనా జీఓ ప్రకారం తమను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తూ.. ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

ప్రజలు.. ప్రభుత్వానికి వారధిలా..

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ కల సకారం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వారు ప్రతినెల గౌరవ వేతనం రూ.28,719తో పని చేస్తున్నారు. గ్రామ పంచాయతీలతో పాటు గ్రామాల ప్రగతికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్) కీలకం. వారు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నా.. క్రమబద్ధీకరణ జరగడం లేదు. ఈనెల 11వ తేదీతో ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యింది. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తుందని ఎంతో ఆశతో విధులు నిర్వర్తిస్తున్నా ఇప్పటి వరకు వరకు దానిపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. వాస్తవానికి ఉద్యోగ ఎంపిక నోటిఫికేషన్‌లో మూడు సంవత్సరాలకే రెగ్యులర్ నిబంధన ఉన్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది గడువు పెంచుతూ 2022 జూలై నెలలో జీఓ నెంబర్ 26ను తీసుకువచ్చింది. దాని ప్రకారం మరో సంవత్సరం అప్రెంటీస్ పీరియడ్‌లోనే విధులు నిర్వర్తించారు. ఇక మహబూబ్‌నగర్ జిల్లాలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 34మంది, జూనియర్ కార్యదర్శులు(జేపీఎస్) 324, ఓపీఎస్ 33 ఉన్నారు. వనపర్తి జిల్లాలో 116, నారాయణపేట 230, గద్వాల 158, నాగర్‌కర్నూల్ జిల్లాలో 311 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విడతల వారీ ఆందోళనలు..

- ఈనెల 14న జిల్లా స్థాయి కార్యక్రమం
- 15న ప్రతి జిల్లాలో ఎంపీడీఓ, డీపీఓ, ఏసీఎల్‌బీ, కలెక్టర్లకు సమ్మె నోటీసు అందజేత
- 17 నుంచి 21 దాకా నల్ల బ్యాడ్జీలతో విధుల నిర్వహణ
- 24న సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ద్వారా విన్నవించేందుకు పోస్టు కార్డుల ఉద్యమం
- 25న డీఎస్ఆర్ యాప్‌ను అనిస్టాల్ చేయడం
- 26న పంచాయతీ కార్యదర్శుల అధికారి వాట్సాప్ గ్రూప్‌ల నుంచి లెఫ్ట్
- 27న జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ,. కలెక్టర్లకు వినతి పత్రాల అందజేత
- 28న ఎంపీడీఓ కార్యాలయాల ముందు నిరసన దీక్షలు, ఆ తర్వాత సమ్మెలోకి..

పని భారం.. ఒత్తిళ్ల మధ్య విధులు

పంచాయతీ పనులతో పాటు ఇతర శాఖలకు చెందిన పనులను కూడా అప్పగిస్తుండడంతో పని భారం పెరిగినా విధులు నిర్వర్తించారు. ఉపాధి హామీ పనులు, తడి, చెత్త సేకరణ, సెగ్రిగేషన్, నర్సరీ తదితర పనులతో పాటు వీఆర్ఓ వ్యవస్థ రద్దు కావడంతో రెవెన్యూ సంబంధిత పనులు కూడా సెక్రటరీలపైనే పడింది. ప్రతి గ్రామం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది జిల్లా రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించడంలో వీరు కీలక పాత్ర పోషించారు. ఇదిలాఉండగా, తమను వెంటనే రెగ్యులర్ చేస్తు ప్రొబిషన్ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలని, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు విడతల వారీగా ఆందోళన తెలుపుతూ.. 28వ తేదీ నుంచి సమ్మెలోకి దిగాలని రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

వెంటనే జీఓ విడుదల చేయాలి



ఎంతో కష్టపడి పోటీ పరీక్షకు సిద్ధమై జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించాం. అపాయింట్‌మెంట్ సమయంలో మూడేళ్లు ప్రొబేషన్ పీరియడ్ అని, ఆ తరువాత రెగ్యులర్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తయినా స్పందన లేదు. ప్రభుత్వం విధించిన లక్ష్యాలు పూర్తి చేసే క్రమంలో ఎంతోమంది ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయాలి.

– రాధాగోపాలం, పంచాయతీ కార్యదర్శుల జిల్లా ప్రధాన కార్యదర్శి, గద్వాల

సర్వీస్ కాలంగా గుర్తించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెంబర్ 26 ప్రకారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అందరినీ క్రమబద్ధీకరించాలి. గడిచిన నాలుగు సంవత్సరాల కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలి. ఈ డిమాండ్ల మేరకే ఆందోళనలు చేపట్టనున్నాం.

– ఆంజనేయులుగౌడ్, జూ.పంచాయతీ కార్యదర్శి, కంసాన్‌పల్లి, ధన్వాడ

ఎంపీపీ భర్తపై దాడి.. కేసునమోదు



క్షతగాత్రుడు రవీందర్‌గౌడ్

మిడ్జిల్: మండల ఇన్‌చార్జి ఎంపీపీ తిరుపతమ్మ భర్త రవీందర్‌గౌడ్‌పై అదే గ్రామానికి చెందిన సురేష్ గురువారం మధ్యాహ్నం దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. వారి కథనం మేరకు.. బోయిన్‌పల్లికి చెందిన ఎంపీపీ తిరుపతమ్మ భర్త రవీందర్‌గౌడ్ ఇటీవల గ్రామంలో ఇల్లు కొనుగోలు చేశారు. అదే ఇంటి పక్కన ఉన్న సురేష్ ఇంటి నిర్మాణం చేపట్టారు. రహదారి విషయంలో గురువారం మధ్యాహ్నం ఇరువురూ గొడవ పడటంతో సురేష్ చేతిలో ఉన్న పారతో రవీందర్‌గౌడ్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంలాల్ నాయక్ తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



సత్కారం అందుకున్న కవులతో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు బి.రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేద్కర్ జీవితంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో భారీ అంబేద్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అంతకుముందు జిల్లా కవులు కవితాగానం చేశారు. అనంతరం వారిని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఓ డా.ఎస్.విజయకుమార్, కవులు డా.బీంపల్లి శ్రీకాంత్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కె.లక్ష్మణ్‌గౌడ్, లైబ్రేరియన్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్పంచ్ ఆకస్మిక మృతి

నర్వ: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన సర్పంచ్ వెంకటేష్ బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. గురువారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాజుల ఆశిరెడ్డి, చెన్నయ్యసాగర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, విండో చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, దండు అయ్యప్ప, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహిళ బలవన్మరణం

బాలానగర్: చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మోతీ ఘనపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె భారతమ్మ (56)కు ఇద్దరు కుమారులుండగా వేర్వేరుగా ఉంటున్నారు. గురువారం చిన్న కుమారుడి ఇంటికి వచ్చిన భారతమ్మ ఎవరూ లేని సమయంలో గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

డీసీఎం డ్రైవర్‌కు తీవ్రగాయాలు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కంటెయినర్ లారీ శాఖాపూర్ దాటిన తర్వాత రోడ్డుకు మరోవైపు ఉన్న హోటల్ వద్దకు వెళ్లడానికి డ్రైవర్ యూటర్న్ తీసుకున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం అదుపు తప్పి కంటెయినర్‌ను వెనక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం క్యాబిన్ నుజ్జునుజ్జయి అందులో ఉన్న గుల్బర్గాకు చెందిన డ్రైవర్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. టోల్‌ప్లాజా అంబులెన్స్‌లోనే జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం మెరుగైన చికిత్స కోసం డ్రైవర్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. డీసీఎం డ్రైవర్‌కు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

దేవరకద్ర రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందగా.. మరొకరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మరికల్ మండలంలోని మాద్వారం గ్రామానికి చెందిన నర్సమ్మ(55) మహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వైపు నడిచి వెళ్తుండగా స్విట్స్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే అదే దారిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న చిన్నచింతకుంట మండలం అప్పంపల్లికి చెందిన శివ అనే యువకుడిని అదే వాహనం ఢీకొట్టడంతో గాయలు కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన మండలంలోని ఎల్లికట్టలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన కుర్మయ్య(50) గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వాగులో చేపల వేటకు వెళ్లారు. ఈ క్రమంలో చేపల కోసం వేసిన వలలో ప్రమాదవశాత్తు చిక్కుకుని మృతిచెందాడు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మాసుంబాబా (ఫైల్)

పెబ్బేరు: వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన పాష, పాషబీ దంపతులు రెండో కుమారుడు మాసుంబాబా (22). ఇతను పట్టణంలో ఓ దుకాణం లీజ్‌కు తీసుకొని రెండేళ్లుగా అరటి పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే నష్టాలు రావడం, ఆర్థిక ఇబ్బందులు అధికమవడంతో రెండు నెలల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గుర్తించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే, గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మాసుంబాబా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. అతని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

గ్రేవ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలి

డీఐజీ ఎల్ఎస్ చౌహాన్



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో గ్రేవ్ నేరాలకు సంబంధించి నమోదైన కేసులను త్వరగా దర్యాప్తు చేసి పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జోగుళాంబ జోన్ 7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా నేరాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంతో పాటు నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నెల రోజుల్లో నివారణ చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గిందని, మరింత జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులను సమ న్వయం చేసుకుని నకిలీ విత్తనాల విక్రయాలు, రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకుంటూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేవిధంగా చూడాలన్నారు. పేలుడు పదార్థాల అక్రమ నిల్వలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీసీటీఎన్ఎస్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన మొదటి మూడు పోలీస్ స్టేషన్స్ భూత్పూర్, మహబూబ్‌నగర్ టూటౌన్, వన్‌టౌన్ సీఐలు రజితరెడ్డి, ప్రవీణ్‌కుమార్, డి.స్వామిగౌడ్‌లతో పాటు సీసీటీఎన్ఎస్ ఆపరేటర్‌లకు ఎస్పీ కె.నరసింహ నగదు బహుమతులు ప్రదానం చేశారు. అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీలు టి.మహేష్, జీవీ రమణారెడ్డి, ఆ దినారాయణ, మధు, లక్ష్మణ్, రామారావు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

‘నిఖిత హంతకులను అరెస్టు చేయాలి’



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: మన్ననూరు రెసిడెన్షియల్ పాఠశాలలో మృతిచెందిన నిఖిత హంతకులను వెంటనే అరెస్టు చేయాలని గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ టైగర్ గంగయ్య మాట్లాడుతూ.. ఈ నెల 16న చలో అచ్చంపేటకు పిలుపునిచ్చామని.. ఈ కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ అధ్యక్షుడు పృథ్వీరాజ్, కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి పల్లె భాస్కర్, సీపీఎం నాయకుడు అశోక్, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు వంకేశ్వరం నిరంజన్, జగ్జీవన్‌రాం విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి వెంటకయ్య, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు జెట్టి వెంకటేష్, బహుజన సంఘాల కన్వీనర్ కొత్తపల్లి శివప్రసాద్, తెలంగాణ ఎరుకల సంఘం నాయకుడు శ్రీనివాసులు, ముస్లిం హక్కుల సాధన సమితి నాయకుడు నిజాం, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఆదిరాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీయూ డిగ్రీ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో డిగ్రీ పరీక్షలకు సంబంధించి సెమిస్టర్ 1, 3, 5 ఫలితాలను పీయూ అధికారులు గురువారం విడుదల చేశారు. ఈ మేరకు సెమిస్టర్–1లో 24,493 మంది హాజరవగా 7,812 మంది ఉత్తీర్ణులై 31.90 శాతం నమోదు చేశారు. సెమిస్టర్– 3లో 20,931 మంది పరీక్షలకు హాజరైతే 8,649 (41.32 శాతం) మంది ఉత్తీర్ణులవగా.. సెమిస్టర్–5లో 13,267 మంది పరీక్షలకు హాజరవగా.. 6,041 (45.53 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ వచ్చే పరీక్షల్లో మరింత ఫలితాలు పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని, రీ వ్యాల్యువేషన్‌కు ఈ నెల 25 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, కంట్రోలర్ రాజ్‌కుమార్, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్, చంద్రకిరణ్ పాల్గొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో కల్లు బాధితులు లేరా..?

స్థానికంగా ఎవరూ లేరని చెప్పుకొస్తున్న సంబంధిత వర్గాలు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో వారం రోజుల నుంచి కలకలం రేపుతున్న కల్తీ కల్లు వ్యవహారంలో బాధితుల వివరాలు బయటకు రాకుండా వైద్యాధికారులతోపాటు ఎక్సైజ్ శాఖ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ నెల 7 నుంచి 12 వరకు జిల్లా జనరల్ ఆస్పత్రిలో మొత్తం 15మంది అడ్మిట్ కాగా ఇందులో 11 మంది మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. వీరిలో బుధవారం రాత్రి వరకు ఇద్దరు పురుషులు, ఒక మహిళ మృతిచెందారు. పరిస్థితి విషమంగా ఉన్న మరో మహిళ హైదరాబాద్‌లో నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. అయితే గురువారం సైతం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఐసీయూలో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. ఈ వివరాలు బయటకు పొక్కకుండా సదరు అధికారులు జాగ్రత్తపడినట్లు సమాచారం. కల్లు బాధితులను పరామర్శించడానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జనరల్ ఆస్పత్రికి వెళ్లడానికి ప్రయత్నం చేయగా ఆస్పత్రిలో బాధితులు ఎవరూ లేరని వైద్యాధికారుల నుంచి సమాచారం రావడంతో ఆమె ఆస్పత్రి సందర్శన కార్యక్రమాన్ని విరమించుకుంది. ఇక ఉదయం డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఆస్పత్రికి వెళ్లి సూపరింటెండెంట్ రామకిషన్‌తో కల్లు బాధితుల పరిస్థితిపై ఆరా తీశారు. ఈ వ్యవహారం రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులు ఉంటే అనుమానం వస్తుందని ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నట్లు కూడా జోరుగా ప్రచారం సాగుతుంది.

మార్కెట్ గేటు గ్రిల్‌లో ఇరుక్కుపోయిన మహిళ కాలు



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ ప్రధాన ద్వారం దగ్గర గురువారం మార్కెట్‌లో చాటకూలీగా పనిచేస్తున్న ఓ మహిళ కాలు గ్రిల్‌లో ఇరుక్కుపోయింది. ప్రధాన ద్వారం దగ్గర మార్కెట్ లోపలికి పందులు ఇతర జంతువులు రాకుండా గతేడాది పైపులతో క్యాటిల్ గేటు ఏర్పాటు చేశారు. అయితే మార్కెట్ లోపలికి రాకపోకలు సాగించాలంటే వాటి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. వీటితో వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకున్నా కాలినడకన వెళ్లే వారికి మాత్రం కొంత ఇబ్బంది ఉంటుంది. గుండ్రటి పైపులు తిరగడం వలన నడిచే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం పాతబజార్‌కు చెందిన మణెమ్మ పైపులలో కాలు ఇరుక్కుపోగా.. వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో సిబ్బంది కట్టర్ తీసుకువచ్చి పైపులను కట్ చేసి కాలు బయటికి తీయాల్సి వచ్చింది.

మార్గదర్శి కేసులో పారదర్శకంగా దర్యాప్తు

- చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం
- సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నట్లు సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించి వాస్తవాలు వెలికి తీయడమే తమ లక్ష్యమని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందాదారులు, డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రజల సంక్షేమం, ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం మౌన ప్రేక్షకులుగా ఉండరాదని 2011లో ఓ కేసులో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో భారీగా ఆర్థిక అక్రమాలు జరిగాయని గుర్తిస్తూ చట్టబద్ధ సంస్థలు ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం, ఉద్యోగులు నిబంధనల రికార్డులు, డాక్యుమెంట్లు సీఐడీకి అందచేసి దర్యాప్తునకు సహకరించాలని సూచించారు. గతంలో శ్రీరామ్ చిట్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూడా తమకు ప్రామాణికమన్నారు.

రుషికొండలో ఉల్లంఘనల్లేవ్

హైకోర్టుకు నివేదించిన కేంద్ర సంయుక్త కమిటీ

సాక్షి, అమరావతి: రిసార్ట్ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా విశాఖలోని రుషికొండపై చేపడుతున్న నిర్మాణాల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేవని హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన సంయుక్త కమిటీ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం నివేదికను కమిటీ బుధవారం హైకోర్టుకు సమర్పించింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) అనుమతించిన మేరకు 9.88 ఎకరాల ప్రాంతంలోనే ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ రుషికొండ రిసార్ట్ ప్రాజెక్టు భవనాలను చేపట్టిందని తెలిపింది. వ్యక్తిగత భవనాల ప్రదేశాల్లో స్వల్ప మార్పులు మినహా ఎలాంటి ఉల్లంఘనలు లేవని కమిటీ తేల్చింది. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ హై కోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రకారం దాదాపుగా సరిపోతున్నట్లు పేర్కొంది. మట్టిడంప్ ప్రాంతమే అథారిటీ పేర్కొన్న దానికన్నా కొంచెం ఎక్కువగా ఉందని, అయితే నిర్మాణం పూర్తయిన తరువాత డంప్ చేసిన మట్టిని తొలగిస్తారని కమిటీ తెలిపింది.

విచారణకు సహకరించాల్సిందే

మార్గదర్శి ఉద్యోగులకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

- తనిఖీలు ఆపేలా ఉత్తర్వులివ్వలేం
- మీడియాకు వివరాల వెల్లడిపైనా జోక్యం చేసుకోలేం
- విచారణ రెండు వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: సీఐడీ అధికారుల విచారణకు మార్గదర్శి ఉద్యోగులు సహకరించాల్సిందేనని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేంద్ర కార్యాలయ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం విచారించిన న్యాయస్థానం.. తనిఖీలు, విచారణను అడ్డుకునేలా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. మీడియాకు అధికారులు వివరాలు వెల్లడించకుండా కూడా జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అయితే తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు మార్గదర్శి కేంద్ర కార్యాలయ ఉద్యోగులపై ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

తనిఖీలు ముగిశాక పిటిషనా?

మార్గదర్శి ఉద్యోగులు గురువారం లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యాహ్నం 2.30 గంటలకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోకుండా నిరోధించాలని, తనిఖీలు నిలిపివేసేలా ఏపీ సర్కార్‌ను ఆదేశించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విన్నవించారు. అయితే బుధవారం ప్రారంభమైన తనిఖీలు గురువారం ఉదయం 9 గంటలకే ముగిశాయని, అలాంటప్పుడు తనిఖీలు ఆపాలని పిటిషన్ దాఖలు చేయడంలో అర్థం లేదని ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి పేర్కొన్నారు. 'సీఐడీ అధికారుల తనిఖీలు ముగిశాయి. ఏ ఉద్యోగిపైనా చర్యలు తీసుకోలేదు. ఎవరినీ బలవంతపెట్టలేదు.. భయపెట్టలేదు. అరెస్టులు చేయలేదు. చట్టప్రకారమే తనిఖీలు జరిగాయి. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదు. పలువురు బ్రాంచ్ మేనేజర్లకు, బ్రాంచ్ ఉద్యోగులకు నోటీసులిచ్చాం. కేంద్ర కార్యాలయ ఉద్యోగులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు' అని హైకోర్టుకు నివేదించారు.

విచారణలో జోక్యం వద్దన్న 'సుప్రీం'..

'ఏ-1 రామోజీరావు, ఏ-2 శైలజ సహా పలువురు మేనేజర్లు ముందస్తు బెయిల్ పొందారు. వారిని కనీసం కస్టడీకి తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. చట్టబద్ధమైన సంస్థలు కేసును విచారించే సమయంలో పూర్తి వివరాలను పరిశీలించకుండా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇవ్వరాదని సుప్రీం కోర్టు పలుమార్లు ఆదేశాలిచ్చింది. నిహారికా ఇన్‌ఫ్రా. వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసుపై విచారణ జరిపిన ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ హైకోర్టులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సెక్షన్ 438 సీఆర్‌పీసీ కింద ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వకూడదని పేర్కొంది. పిటిషనర్‌కు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి 'వెకేట్' పిటిషన్ దాఖలు చేసుకోవాలని ప్రతివాదులను ఆదేశించడం సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌లో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసే వరకు ఎలాంటి రిలీఫ్ ఉత్తర్వులు ఇవ్వవద్దు' అని గోవింద్‌రెడ్డి అభ్యర్థించారు.

ప్రైవేటీకరణపై ముందుకు వెళ్లం

- 'విశాఖ ఉక్కు'పై కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే

దొండపర్తి (విశాఖ దక్షిణ)/బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకు వెళ్లడం లేదని కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్తే స్పష్టం చేశారు. గురువారం విశాఖ పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ కంటే ముందు ఆర్ఐఎన్ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్)ను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పూర్తి సామర్థ్యం మేరకు ప్లాంట్ పనిచేసే ప్రక్రియపై దృష్టి సారించామని తెలిపారు. గనుల సమస్యను కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయాలన్నింటిపై ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో సాయంత్రం ఆయన నోవోటెల్‌లో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉదయం చేసిన ప్రకటనపై మరింత క్లారిటీ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ప్లాంట్‌ను మరింత బలోపేతం చేస్తామని మాత్రమే మీడియాకు చెప్పానన్నారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చేలా సహకరిస్తామన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనే అంశం తన చేతుల్లో లేదని, కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



కేంద్ర సహాయ మంత్రితో సమావేశమైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు

సింగరేణిలో ఆంధ్ర వాటా తేల్చండి

బీఆర్ఎస్ స్టీల్ ప్లాంట్ అంశాన్ని రాజకీయంగా వినియోగించుకుంటోందని ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్ అన్నారు. సింగరేణి గనుల్లో ఆంధ్ర రాష్ట్రానికి వాటా ఉందని, ముందు ఆ వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై బీఆర్ఎస్‌కు అంత చిత్తశుద్ధి ఉంటే పోలవరానికి సహకరించాలన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు రూ.5 వేల కోట్లు నిధులు ఇవ్వాలన్నారు.

ఇంకా ఎన్నాళ్లీ విచారణ?

- సీబీఐ న్యాయవాదిని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్టు
- వివేకా హత్య కేసులో తదుపరి విచారణ 17కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రారంభించి ఇప్పటికే రెండేళ్లు అయ్యిందని.. ఇంకా ఎన్నాళ్లు విచారిస్తారని సీబీఐని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. హత్య కేసును కూడా ఇన్నాళ్లు సాగదీస్తే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేసింది. దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. 'వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ చెప్పినట్లు ఏ-4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ వైఎస్ భాస్కర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి, సీబీఐ తరఫున నాగేందర్ వాదనలు వినిపించారు.

కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ..

'గూగుల్ టేక్ అవుట్, దస్తగిరి వాంగ్మూలం తప్ప కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల పేర్ల ప్రస్తావన ఎక్కడా లేదు. వీరికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవు. నేను ఇక్కడే ఉండి.. నా ఫోన్‌ను మరో చోటకు తీసుకుపోతే నేను అక్కడ ఉన్నట్లు కాదు. కాబట్టి గూగుల్ టేక్ అవుట్‌ను పరిగణనలోకి తీసుకోలేం. ఇలాంటి పరిస్థితిలో వారిని వేధింపులకు గురి చేయడం సమర్థనీయం కాదు. ఇప్పటికే సీబీఐ వారిని పలుమార్లు విచారణకు పిలిచింది. వారు కూడా పూర్తిగా విచారణకు సహకరించారు. ఎర్ర గంగిరెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ ఇప్పటివరకు రికార్డు చేయలేదు. సీబీఐ.. దర్యాప్తును ఇంకా సాగదీస్తోంది. కారణం ఏంటో తెలియడం లేదు. కోర్టుల్లో పిటిషన్లు దాఖలైనా దర్యాప్తు ఆపాలని ఏ ధర్మాసనం చెప్పలేదు. దర్యాప్తు అధికారి కేసును తప్పుదారి పట్టిస్తుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఒక కిరాయి హంతకుడిని అరెస్టు చేయకుండా బెయిల్‌కు సహకరించిన విచారణను ఏమనాలి? కేవలం కొందరిని టార్గెట్ చేసుకునే విచారణ సాగుతోంది తప్ప.. సాక్ష్యాలు సేకరించే పని చేయడం లేదు. వైఎస్ భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి' అని నిరంజన్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వైఎస్ భాస్కర్ రెడ్డి, ఇతరులు (నిందితులుగా లేని వారు) పరారీలో ఉన్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదు.. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నారు అని సీబీఐ తరఫు న్యాయవాది నాగేందర్ తెలిపారు. కోర్టులో పిటిషన్ల కారణంగా కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందన్నారు. దర్యాప్తు అధికారికి.. కోర్టు పిటిషన్లతో ఏం సంబంధం.. ఆయన విచారణ కొనసాగించవచ్చు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. సుప్రీంకోర్టు.. దర్యాప్తు పూర్తి చేయడానికి ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చిందని నాగేందర్ తెలిపారు. ఇది హత్య మాత్రమే కాదని.. హత్య ద్వారా లబ్ధి పొందేందుకు కుట్ర జరిగిందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

విహరించే వనంపై మోహరించిన అవినీతి

- కేబీఆర్ పార్కును కనుమరుగు చేసే కుట్ర
- మంత్రి డెవలపర్స్‌కు 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతి
- కేటీఆర్ మిత్రుల కోసం నిబంధనలు గాలికి
- రాజయ్యను బర్తరఫ్ చేసినట్లు కేటీఆర్‌నూ చేయాలి
- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబం ధన దాహంతో దశాబ్దాల చరిత్ర కలిగిన కేబీఆర్ పార్కును కనుమరుగు చేసే కుట్రకు తెరతీసిందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. జూబ్లీ హిల్స్ కేబీఆర్ పార్క్ దగ్గర నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 15 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులివ్వడమంటే హైదరాబాద్ నగరంలో విధ్వంసం సృష్టించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. 16 మంది సీఎంలు కఠిన నిబంధనలు పెట్టి కాపాడిన చరిత్రాత్మక వారసత్వ సంపద కలిగిన పార్కును ఈ ప్రభుత్వ పెద్దలు ధ్వంసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి కేటీఆర్ స్నేహితుల కోసం చేస్తున్న ఈ ఆగడాలను కేసీఆర్ వెంటనే అడ్డుకోవాలని రేవంత్ డిమాండ్ చేశారు. మంత్రి రాజయ్యను బర్తరఫ్ చేసినట్టు కేటీఆర్‌ను కూడా వెంటనే బర్తరఫ్ చేయాలని, అప్పుడే కేసీఆర్‌కు పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

"2012లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీ అక్కడ మూడు అంతస్తుల నిర్మాణానికే అనుమతి ఇచ్చింది. కానీ 2016లోని టీఆర్ఎస్ సర్కారు మంత్రి డెవలపర్స్‌కి జీ ప్లస్ 7 ఫ్లోర్లకు అనుమతిచ్చేసింది. ఇక మంత్రి డెవలపర్స్‌లో ఆర్ఎస్ఆర్ డెవలపర్స్ భాగస్వాములు అయ్యాక 12 అంతస్తులకు దరఖాస్తు చేసుకుంటే దానికి కూడా అనుమతిచ్చేశారు. ఇప్పుడు ఏకంగా 15 అంతస్తులకు కూడా అనుమతిచ్చేశారు "అని రేవంత్ వివరించారు.

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతి ఎక్కడైనా ఉందా?

భూమి లోపల ఐదంతస్తులకు అనుమతిచ్చారని.. ప్రపంచంలో ఎక్కడైనా ఉందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీరు తవ్విన గోతుల్లోనే మిమ్మల్ని పాతిపెడతామంటూ రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వాళ్లకు ఆంధ్రానే దిక్కని.. ఆపై బంగాళాఖాతమేనని వ్యాఖ్యానించారు. కేబీఆర్ పార్క్ దగ్గరకు వచ్చే వాకర్స్ అసోసియేషన్ ప్రజాప్రయోజన వాజ్యం వేయాలని కోరారు. రెండు మూడు రోజులు తర్వాత మరిన్ని వివరాలతో మీడియా ముందుకు వస్తానని రేవంత్ చెప్పారు.

ముగిసిన బావాజీ జాతర



హుండీ డబ్బులు లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గురులోకామాసంద్ ప్రభు(బావాజీ) జాతర గురువారం ముగిసింది. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో ఉన్న హుండీ లెక్కింపు చేపట్టగా రూ.18,91,608, ఆంజనేయస్వామి దగ్గర ఉన్న హుండీ నుంచి రూ.1,57,595 వచ్చింది. అలాగే కాళికాదేవి దగ్గర ఉంచిన హుండీ ద్వారా రూ.12,42,550, స్వామివారికి వచ్చిన పశువులు అమ్మగా రూ.69 వేలు, టెంకాలయ వేలం రూ.2.93 లక్షలు, కొబ్బరి చిప్పలు రూ.31 వేలు, తలనీలాలకు రూ.7.66 లక్షలు కలిపి మొత్తంగా నాలుగు రోజుల పాటు జరిగిన బావాజీ జాతర ఉత్సవాల్లో రూ.44,50,951 ఆదాయం వచ్చినట్లు ఈఓ కొమ్మాల్ తెలిపారు. స్వామి, అమ్మవారికి వచ్చిన బంగారు, వెండి ఆభరణాలను లెక్కింపు చేయాల్సి ఉందన్నారు. ఈ డబ్బులను మద్దూరు ఎస్‌బీఐలో డిపాజిట్ చేస్తామన్నారు. లెక్కింపులో మద్దూరు ఎస్‌బీఐ సిబ్బంది, ఆలయ ధర్మకర్తలు గోపాల్‌నాయక్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉడిపి పీఠాధిపతి పూజలు



కృష్ణా: మండలంలోని గుడేబల్లూర్‌లో స్వయంభూగా వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామిని గురువారం కర్ణాటకలోని ఉడిపి మఠం పీఠాధిపతి విశ్వ ప్రియతీర్థ మహాస్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి మేళతాళాలు, వేదమంత్రాలతో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సాగునీటికి తొలి ప్రాధాన్యత

- 'తుమ్మిళ్ల', జోగుళాంబ రిజర్వాయర్, మల్లమ్మకుంటను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి
- ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరిని బరిలో నిలిపినా గెలిపిస్తాం
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్/అలంపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు దృష్ట్యా సాగునీటికి తొలి ప్రాధాన్యత ఇస్తుందని, తుమ్మిళ్ల ఎత్తిపోతలు, జోగుళాంబ రిజర్వాయర్, మల్లమ్మకుంట అందుబాటులోకి వస్తే అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందుతుందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం మొదటగా అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద్ స్కీం పనుల పురోగతి, నిర్మాణాలకు నీటి ఇబ్బందులు, మిగతా ఆలయాల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెట్టెంపాడు 100వ ప్యాకేజీకి రూ.300కోట్లు

అనంతరం ఆయన అలంపూర్ మండలంలోని గొందిమల్ల గ్రామం, జోగుళాంబ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా, తుంగభద్ర నదులు ఉన్నప్పటికీ కొన్ని పరిస్థితుల కారణంగా ఇక్కడ సాగు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందించడానికి సీఎం కేసీఆర్ చర్యలు చేపడుతున్నారని, తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరు అందించడానికి మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గొందిమల్ల వద్ద 40 టీఎంసీల రిజర్వాయర్ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో నెట్టెంపాడు 100వ ప్యాకేజీ పనులు పూర్తి చేయడానికి రీ ఎస్టిమేషన్ జరుగుతుందని, ఈ పనుల కోసం అదనంగా రూ.300 కోట్ల వరకు కావచ్చనే అంచనా ఉన్నట్లు తెలిపారు. త్వరలో సీఎం దృష్టికి తీసుకెళ్లి వీటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



గొందిమల్లలో రిజర్వాయర్ నిర్మించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

జూపల్లి మొదట ఇంట గెలవాలి..

మాజీ మంత్రి జూపల్లి ముందు ఆయన నియోజకవర్గంలో గెలవాలని, ఆ తర్వాత ఉమ్మడి జిల్లా గురించి ఆలోచించాలన్నారు. నలుగురు ఉండే కుటుంబంలోనే విభేదాలు ఉంటాయని, ఇంత పెద్ద పార్టీలో చిన్న చిన్న మనస్పర్థలు ఉండటం సాధారణమేనని, అందరిని కలుపుకొని బీఆర్ఎస్‌ని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. అలాగే, అలంపూర్‌లో డిగ్రీ, పాలిటెక్నిక్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటుకు, మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని, అలంపూర్‌లో తిరిగి బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని, సీఎం కేసీఆర్ అభ్యర్థిగా ఎవరిని బరిలో నిలిపినా గెలిపించే బాధ్యత తీసుకుంటామని చల్లా అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాయకులు సుదర్శన్ గౌడ్, నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రుక్మొద్దీన్, మహేశ్వర్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి, మహేష్, సూరి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాల్వకు నీరు బంద్.. ఎండుతున్న పంటలు


పాన్‌గల్: కేఎల్ఐ కాల్వకు ఇటీవల సాగునీరు బంద్ కావడంతో పంటలు ఎండుమొఖం పట్టాయి. దీంతో వరి సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలోని తెల్లరాళ్లపల్లితండా సమీపంలోని కేఎల్ఐ కాల్వను నమ్ముకొని 40మంది గిరిజన రైతులు 50 ఎకరాలకు పైగానే వరి పంట సాగుచేశారు. ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. అయితే, యాసంగి సీజన్ మొదట్లో పంటలు చేతికందే వరకు సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇచ్చారని.. తీరా ఇప్పుడేమో నీరు బంద్ చేశారని ఈ హామీలన్నీ నీటిమూటలేనా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికందే దశలో ఉందని, సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పంటలు ఎండుమొఖం పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం వరకు వరి పంటలు ఎండిపోయాయని వారం రోజుల్లో కాల్వకు సాగునీరు సరఫరా కాకపోతే పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. గురువారం ఎండిన పంటలను గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ పరిశీలించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వకు సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయనతోపాటు గిరిజన రైతులు కోరారు.



ఎండిన పంటను చూపుతున్న గిరిజన రైతు రాములునాయక్

చిరుధాన్యాల 'అంబేడ్కర్'

భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం నారాయణపేట మండలం జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ కంపిలి వెంకటేష్ చిరుధాన్యాలతో అంబేడ్కర్ విగ్రహాన్ని రూపొందించారు. మినపప్పు, రాగులు, సజ్జలు, పెసర, ఉలవలు తదితర చిరుధాన్యాలను వినియోగించానని.. పిల్లల మదిలో అంబేడ్కర్‌ను నిలపాలనే లక్ష్యంతో ఇలా సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. – నారాయణపేట రూరల్



నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు

- గత నెలలో ముగిసిన జోగుళాంబ ఆలయ పాలక మండలి
- చైర్మన్ పీఠం కోసం రాజకీయ నాయకుల ఆసక్తి

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ఏర్పాటు కోసం రాజకీయ నాయకులంతా తహతహలాడుతున్నారు. గత నెల 28 పాలకమండలి ముగియడంతో మళ్లీ నూతన పాలకమండలి నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. ఈ క్రమంలో జోగుళాంబ ఆలయ పాలక మండలి పదవి చేపట్టేందుకు ఎంతోమంది ఉవ్విళ్లూరుతుండటంతో ఈ పదవికి పోటీ పెరిగింది. దీంతో ప్రతి రాజకీయ నేత పదవీకాలం ముగిసిన నాటి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్‌తో టచ్‌లో ఉంటూ కొత్త నోటిఫికేషన్ వేయించేందుకు చేసిన తెరచాటు ప్రయత్నాలు ఫలించనున్నాయి.

రేపో మాపో విడుదల..

జోగుళాంబ ఆలయ పాలకమండలి కోసం రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ నుంచి నూతన పాలక మండలి నియామకం కోసం ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానున్నట్టు విశ్వసనీయ సమాచారం. పాలకమండలి నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి దరఖాస్తు చేసుకున్న వారి జాబితా పరిశీలనకు, విచారణకు 40 రోజుల గడువు ఉంటుంది. సివిల్ క్రిమినల్ కేసులు, ఆలయ భూములు గుత్తకు తీసుకున్న వారు, అలాగే ఆలయంలో కాంటాక్ట్ పనులు తీసుకున్న వారు లేదా ఆలయ ఉద్యోగులతో బంధుత్వం ఉన్నవారి పేర్లను దేవాదాయశాఖ చట్టం ప్రకారం తొలగిస్తారు. కాబట్టి గతంలో ఎదురైన పలు పరిణామాలు, కోర్టు కేసులు వంటి అన్ని అంశాలను నిశితంగా పరిశీలిస్తూ తమ వారిని నియమించుకునేందుకు తెరచాటుగా గట్టి ప్రయత్నాలు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం.

పీఠం కోసం పోటీ..

ఆలయ చైర్మన్ పీఠం ఎలాగైనా కైవసం చేసుకునేందుకు గుట్టుగా గట్టి పోటీ తయారైంది. ఇప్పటికే పెద్దల ఆశీస్సులు పొందేందుకు పలువురు రాజకీయ నాయకులు గుట్టుగా పెద్ద వారిని కలుస్తూ తమకే పీఠం ఇవ్వాలని కోరుతున్నట్టు తెలుస్తుంది. అలంపూర్‌లో మారుతున్న రాజకీయ సమీకరణలు బట్టి ఏ నిమిషానికి ఏం జరుగతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం

సమానత్వానికి దర్పం.. అంబేద్కర్



కందనూలు: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సమానత్వానికి దర్పణమని అని ఎమ్మెల్సీ, కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ చాంబర్‌లో నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య రచించిన 'మా అక్షర యుద్ధం అంబేద్కర్' దీర్ఘ కవితను దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, సంచాలకులు భాషా సాంస్కృతిక శాఖ మామిడి హరికృష్ణ, చరిత్ర పరిశోధకులు శ్రీనివాస్, కవి విమర్శకులు కోయి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ దీర్ఘకవిత అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. కార్యక్రమంలో బహుజన ఉద్యమ నాయకులు శ్రీనివాస్, సుభద్ర, బాల్‌రాం సైకిబాబా, మోహన్, మద్దిలేటి, కాశన్న, రవిప్రకాశరావు, దినకర్, రేడియం, కృష్ణ, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.